## నేను :

పిపీలికమంత ప్రాణశక్తిని సంపాదించుకుని బ్రహ్మాండాన్ని శాసించే మానవజన్మనెత్తడంకోసం అమ్మ గర్భంలో కొంచెం చోటు సంపాదించుకున్నాను. ప్రాణనాడుల స్పందన తప్పించి అంతా దుర్భర నిశ్శబ్దం. అంతర్ముఖంగా వెలిగే ఆత్మజ్యోతి తప్ప అంతా గాఢాంధకారం. కొన్నాళ్లు ఊర్ధ్వముఖం. కొన్నాళ్లు అధోముఖం. క్షణక్షణ గండం నూరేళ్లాయుష్షుగా గడిపి భూమ్మీద పడ్డాక నా అస్థిత్వపు తొలి భావరూపం 'నేను'.



# ఉరి

శ్రీదేవి

**పువ్వు పూసినా గువ్వ కూసినా అన్నీ నాకోసమేనని ఓ గట్టి నమ్మకం. అన్నీ నావేనని ఆరాటం. సృష్టిలోని అందమైనవన్నీ నాకోసమేననుకుంటూ ఉండే నాకోసం ఒక నువ్వు సృష్టించబడ్డావు.**

## నువ్వు :

పువ్వు విరిస్తే సంతోషపడిపోయి, చీకటి రాత్రి ఆకాశం చిచ్చుబుడ్డిలా నక్షత్రాల రవ్వల్ని విసిర్తే విస్తుబోయి, కాలికింద అప్రమేయంగా నలిగిపోయిన చీమని చూసి అయ్యో అనుకుని ... అన్నిటినీ నిస్వార్థంగా ప్రేమించే నీకు కొన్ని భావాలుంటాయని నేనెప్పుడూ అనుకోలేదు. ఒకవేళ ఒకటో రెండో అలాంటివేమైనా నాకడ్డు తగిలితే నిస్సంకోచంగా వాటిని ఉరి తీసేవాడిని. అలా ఉరితీయబడ్డ భావాలు నీ మనసు వాకిలికి ప్రేతకళతో వేళ్లాడుతూ కొత్త భావాలని బైటికి రానివ్వకుండా లోనికి పోనివ్వకుండా నిన్నో జడపదార్థంగా మార్చేశాయి. చైతన్యం ఉన్న మనిషి చైతన్యం లేనట్టు ఉండటం ఎంత దుస్సహమో నాకెప్పుడూ అనుభవంలోకి రాలేదు. కానీ నువ్వు నాకన్నా పెద్ద తలారివని తెలిసి ఆశ్చర్యపోయాను.

## కథలోకి :

అక్కడ నిశ్శబ్దం విస్తారంగా పరుచుకుని ఉంది.

మనిషి పుట్టబోయే ముందు ఉండేది నిశ్శబ్దమే. మరణించాక జారేది నిశ్శబ్దంలోకే.

నిశ్శబ్దంలోంచే ఆవిష్కరింపబడి - మళ్లీ నిశ్శబ్దంలోకి నిష్క్రమించటమే జీవితమైతే దానికింత కోలాహలం ఎందుకు? అంతుచిక్కని ఈ ప్రశ్నకి జవాబు వెతుకుతూ బెడ్మీదున్న భార్యకేసి చూశాడు కిషోర్.

ఆకుపచ్చటి హాస్పిటల్ గౌనులో అస్థిపంజరంలా ఉంది సుచేత. తలమీది వెంట్రుకలన్నీ ఊడిపోయి బోర్లించిన చెంబులా ఉంది. గత కొన్నాళ్లుగా కేన్సర్తో బాధపడుతోంది. రేడియం ట్రీట్మెంటు ఇస్తున్నారు. ట్రీట్మెంటు తట్టుకోలేక, వ్యాధి కుదరక నామావశిష్ఠంగా మిగిలింది. మృత్యువుకి రోజులు లెక్కపెడ్తోంది.

ఎలాంటి మనిషి ఎలాగైపోయింది? రోజా చూస్తూనే ఉన్నా దిగ్భ్రమ కలుగుతోంది కిషోర్కి. కళ్లల్లో నీళ్లు సుళ్లు తిరుగుతున్నాయి. తనేడిస్తే ఆమె మరింత బెంబేలెత్తిపోతుందని దుఃఖాన్ని నిగ్రహించుకుంటున్నాడు.

"బాధ బాగా ఉందా చేతూ?" గద్గదస్వరంతో ఆమె మొహంలోకి మొహంపెట్టి ఆర్తిగా అడిగాడు. ఆమె కన్నీళ్లతో తలూపింది.

"పాప ... పాపెలా ఉంది? ఏడుస్తోందా?" అతి ప్రయాసమీద అడిగింది.

"హాస్టల్లో చేర్చాను. వాళ్ల ప్రిన్సిపల్కీ వాళ్లకీ చెప్పాను జాగ్రత్తగా చూసుకోమని. మరేం భయం లేదు. నువ్వు దానిగురించి బెంగపెట్టుకోకు!" ఓదార్పుగా చెప్పాడు.

ఆమె మనసులో జ్వాలలాంటిది ఎగిసిపడింది. తల్లి మృత్యుశయ్యలో... తండ్రి ఆమెను చూస్తూ .... మూడేళ్ల పసిది ఆలనా పాలనా లేకుండా హాస్టల్లో ... ఏ జన్మలోనో కాదు, ఈ జన్మలోనే చేసుకున్న పాపానికి శిక్ష ఇది .... భారంగా కళ్లు మూసుకుంది. మూసుకున్న కనుకొలకుల్లోంచి నీళ్లు జారిపడ్డాయి.

తలుపు చప్పుడైంది. కిషోర్ తల తిప్పి చూశాడు. అరుణ! అతని మొదటి భార్య. ఎందుకొచ్చింది? ఎదుర్కోలేనట్టు తల దించుకున్నాడు. సుచేత కూడా అరుణని చూసింది. ఆశ్చర్యంతో కళ్లు పెద్దవయ్యాయి. అలసి సొలసిపోయిన గుండెలోకి ఏదో కొత్త శక్తి వచ్చి చేరుకున్నట్టయింది.

వాళ్లు ముగ్గురిమధ్యా గతం విస్తరించుకుని ఉంది. దాని పొడవు నాలుగేళ్ల కాలవ్యవధి. వెడల్పు ఒక మగవాడి నమ్మక ద్రోహం. లోతు ఒక స్త్రీ గుండెకి తగిలిన గాయమంత.

✣ ✣ ✣


అరుణా, కిషోర్ ఇద్దరూ ఒకేరోజు న్యూ అపాయింటుమెంటు మీద జాయినయ్యారు. ఇద్దర్నీ ఒకే బ్రాంచిలో వేశారు.

అరుణ తెల్లగా, పొడుగ్గా ఉంటుంది. సిల్కీ హెయిర్. సన్నటి నాజూకైన ఫిజిక్తో చూసేవాళ్లని ఆకర్షిస్తుంది. కిషోర్ ఆ ఆకర్షణకి మినహాయింపు కాలేకపోయాడు.

కుతూహలం ... ఆకర్షణ ... ప్రేమ ... పెళ్లి ... ఒక్కొక్క మెట్టే ఎక్కారు వాళ్లు.

సృష్టిలోని చరాచరప్రాణులన్నీ కేవలం ఒకే

ఒక అర్జ్‌కోసం ఒకదానినొకటి కావాలనుకుంటాయి. మనుషుల అవసరం కూడా అదే అయినా, దాన్నంత ఓపెన్‌గా చెప్పుకోలేక 'ప్రేమ' అనే కోటింగ్ వేసుకుంటారు. ఆ ప్రేమే మనుషుల చేత సహజీవనం చేయిస్తోందని వంచన చేసుకుంటారు. అసలంటూ ఉందో, లేదో తెలీని మనసుని టేకిట్ ఫర్ గ్రాంటెడ్‌గా ఉందనేసుకుని అందులోంచి జనించే భావపదార్థంగా- ప్రేమని భావించి, దాంతోటే జీవితం ముడిపడిందని నిర్ధా రించుకుని ఆఖర్ని అదంతా ట్రాష్ అని తెలిస్తే -



ఆ తెలిసినప్పటి స్టేజిలో ఉంది అరుణ.

ఆమెకి నైన్త్ మంత్ నడుస్తోంటే కాజువల్‌గా బజార్లో కలిసింది సుచేత. ఇద్దరూ క్లాస్‌మేట్స్. తనుకూడా అక్కడే జాబ్ చేస్తున్నట్లు చెప్పింది సుచేత. చెప్పి -

"ఏంటే, ఎవర్నీ పిలవకుండా పెళ్లి చేసుకున్నావ్?" అడిగింది. వట్టి అడగటమే కాదు, నిలదీసే చనువు కూడా ఉంది ఇద్దరి మధ్యా.

"లవ్ మేరేజి ... పెద్దవాళ్లకి ఇష్టం లేదు. అందుకని సింపుల్‌గా తిరుపతిలో చేసేసుకున్నాం. ఎవర్నీ పిలవలేదు!" అంది అరుణ.

"నాకిక్కడ ఏపీఎఫ్‌సీలో పోస్టింగిచ్చారు. ఫస్ట్ అపాయింటుమెంటు ఢిల్లీలో ఇచ్చారు. నానా తిప్పలూ పడ్తే ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు. డాపార్ట్‌మెంటల్ ట్రాన్స్‌ఫర్. ప్రస్తుతం షట్లింగ్ చేస్తున్నాను. ఏదేనా చిన్న పోర్షన్ దొరుకుతుందేమో, ఇక్కడే ఉండిపోయి, వీకెండ్స్‌లో అమ్మా వాళ్ల దగ్గిరికి వెళ్తే సరిపోతుందనిపిస్తోంది. షట్లింగ్‌తో చాలా స్ట్రెయిన్ అవుతోంది."

"మేం ఉంటున్న ఇల్లు పెద్దదే. గెస్ట్ రూమ్ సెపరేట్‌గా ఉంది. నువ్వుగానీ ఉంటానంటే సబ్‌లెట్ చేస్తాం!" అంది అరుణ.

"వండ్రఫుల్ ఐడియా!" వెంటనే ఒప్పుకుంది సుచేత.

సుచేతని కిషోర్‌కి పరిచయం చేస్తూ ఆమెను గెస్ట్‌రూమ్‌లో ఎకామిడేట్ చేస్తే బావుంటుందన్న తన ఊహని అతనితో చెప్పింది అరుణ.

విమెన్ ఎంప్లాయ్‌మెంట్ పెరిగిపోతున్నకొద్దీ సమస్యలు జటిలమవుతున్నాయి. ఇదివరకు భార్యాభర్తల్ని ఒకేదగ్గిర ఉంచాలనీ, పెళ్లికాని అమ్మాయిలకు వీలైనంతవరకూ తల్లిదండ్రులదగ్గిర పోస్టింగ్ ఇవ్వాలనీ కొన్ని ప్రాతిపదికలు ఉండేవి. చాలావరకూ అవి అమలయ్యేవి. మారుతున్న రోజుల్లో ఇది సాధ్యపడటంలేదు. సుచేతకి పేరెంట్స్ దగ్గరకి ట్రాన్స్‌ఫరవడానికి కొంత టైం పడుతుంది. ఈలోగా ఆమె ఇక్కడ షెల్టర్ చూసుకోవాలి. ఢిల్లీ నుంచి ఆమెను ఏపీకి తీసుకురావడానికి భగీరథ ప్రయత్నం చేసి అలిసిపోయిన ఆమె తండ్రి ఇప్పుడామెని తన దగ్గరకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని, పెళ్లి చేసి మళ్లీ ఇంకోచోటికి ట్రాన్స్‌ఫర్ చేయించే పిచ్చిపనికన్నా ఇక్కడే ఎలియన్స్ చూస్తున్నాడు.

ఈ పరిస్థితుల్లో ఆయనకి సుచేత ఫ్రెండింట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంటానని చెప్పిన మాటతో చాలా రిలీఫ్‌గా అనిపించింది. అరుణ

ఆయనకి తెలుసు. అదీకాక ఆయనకి వర్కింగ్ విమెన్స్ హాస్టల్స్‌మీద మంచి అభిప్రాయం లేదు.

ఎవరికీ లేని అభ్యంతరం కిషోర్‌కి కూడా లేదు.

✣ ✣ ✣

అరుణకి సడెన్‌గా పెయిన్స్ స్టార్టయ్యాయి. కిషోర్ కంగారు పడుతూ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లాడు. బేబీ పొజిషన్ మారిందని, సిజేరియన్ చేయాలని చెప్పింది డాక్టర్. అరుణ ఎడ్మిట్ అయింది.

ఆమెకి మనసులో భయంభయంగా ఉంది.

## సమ్‌థింగ్ రాంగ్!

'శ్రీమతీ వెళ్లొస్తా!' చిత్రంలో నటిస్తుండగా యూనిట్ అందరిదృష్టీ పూనమ్‌మీదే ఉండేంత యాక్టివ్‌గా ఉండేది. అంతే యాక్టివ్‌గా ప్రెస్‌వారితోనూ మాట్లాడేది. జగపతిబాబు, మిగతా సహనటులంతా ఈ సినిమా రిలీజైతే నిన్ను పట్టుకోలేం అంటూ ఏడిపించేవారు కూడా. అయితే 'శ్రీమతీ వెళ్లొస్తా' సినిమా రిలీజై ఆశించినంత విజయవంతం కాలేదు. ఇటీవల పూనమ్ మాట్లాడుతూ, "తెలుగులో పెద్ద దర్శకుడు రాఘవేంద్రరావు, సక్సెస్‌ఫుల్ హీరో జగపతిబాబు, సక్సెస్‌ఫుల్ బానరు గీతా ఆర్ట్ చిత్ర ... అన్నీ బాగున్నాయి. నా పాత్ర బాగుంది. మరెక్కడుందో లోపం? సినిమా క్లిక్ అవలేదు. తదుపరి వారిసినిమాల్లో నటించమని అడిగిన బడా డైరెక్టర్లు అందరూ ముఖం చాటు చేసుకుంటున్నారు. సమ్‌థింగ్ రాంగ్!" అంది దీర్ఘంగా ఆలోచిస్తూ.



దగ్గర నిల్చుని నీకేం భయం లేదని చెప్పేవాళ్లు లేరు. తల్లి గుర్తొచ్చింది. తను అన్యకులస్తుణ్ణి చేసుకుందని తండ్రికి కోపం. కులం అనేది పెద్ద ఎడిక్షన్. అందులోంచి మనిషి బయటకు రాలేడు.

ఆమె హిస్టీరిగ్గా ఏడుస్తుంటే డాక్టర్ కోప్పడింది. "చిన్నపిల్లలా ఏడుస్తున్నావేంటి? నీకేమీ కాదు. కళ్లు తెరిచేసరికి చక్కటి పాపాయిని చూస్తావు. బేబీని చూసేసరికి అన్నీ మరిచిపోతావు. మళ్లీ ఏడాదికల్లా ..." అని నవ్వించింది.

ఆపరేషన్ తర్వాత కొన్ని కాంప్లికేషన్స్ డెవలప్ అయ్యాయి. అవి సర్దుకునేసరికి ఒళ్లంతా నీరు పట్టింది. అందులోంచి బయటపడేసరికి పిట్స్ వచ్చేవి. దాదాపు నెల్లాళ్లు హాస్పిటల్లోనే ఉంది. ఆమెనీ, పాపానీ ఎటెండవడానికి ఆయాని పెట్టాడు కిషోర్.

పెద్దవాళ్లు పూనుకుని చేసే పెళ్లిలో భార్యాభర్తలు ఒకరికోసం ఒకరనే భావాన్ని ప్రతిసారీ ఇండ్యూస్ చేస్తారు. ఇద్దరిలో ఒకవిధమైన నిబద్ధత చోటుచేసుకుంటుంది. లవ్‌మేరేజెస్‌లో సెల్ఫ్ డిసిప్లిన్ ఉండాలి. అదొక్కటే భార్యభర్తలిద్దరినీ కట్టిపడేసే బంధం.

అరుణ హాస్పిటల్లో తన అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలో కిషోర్ ఇంట్లో ఒంటరి రాత్రులతో పోరాడేవాడు. సుచేత అదే ఇంట్లో ఉంటోందన్న ఊహ అతన్ని టెంప్ట్ చేసేది. ఆమెక్కూడా అరుణ లేని ఇంట్లో ఉండటం ఇబ్బందిగానే ఉంది. వీలైనంతవరకూ షటిల్ంగ్ చేస్తోంది. మరీ అలిసిపోయినప్పుడో, ఆఫీసులో లేటైనప్పుడో మాత్రం రూమ్‌కొస్తోంది. వచ్చి కూడా పెద్దగా అరుణావాళ్ల విషయాల్లో ఇన్‌వాల్వ్ కాకుండా అంటీముట్టనట్టే ఉంటోంది. రోజా అరుణని చూసి వస్తోంది. రోజా రెండుమూడుసార్లయినా హాస్పిటల్‌కి వెళ్లొస్తాడు కిషోర్. భార్య అనారోగ్యం అతనికి కొంచెం అసహనం కలిగిస్తోంది. పెళ్లయిన వెంటనే ప్రెగ్నెన్సీ, ఆ తర్వాత డెలివరీతో ఈ అనారోగ్యం - జీవితంలో ఏమీ అనుభవించలేదనిపిస్తోందతనికి.

ఆమెను పెళ్లి చేసుకుని తనేం సుఖపడ్డాడు? రావాల్సిన కట్నం రాలేదు. హాస్పిటల్ ఖర్చు తడిసి మోపెడవుతోంది. బాంక్ బాలెన్స్ చాలా వరకూ ఖర్చయిపోయింది.

పెళ్లి తర్వాతి మెట్టయిన వికర్షణలోకి అడుగు మోపాడు. ఆ తర్వాత రెండురోజులకి అతని కళ్లల్లో ఒకరకమైన అపరాధభావన కనిపించింది అరుణకి. ఇంటికొచ్చాక అదేమిటో అర్థమైంది. అప్పటికి సుచేత రూమ్ వెకేట్ చేసి వెళ్లిపోయింది.

✣ ✣ ✣

నాతో ఒక్క మాటయినా చెప్పకుండా వెళ్లిపోయిందేమిటి? అని పదే పదే ప్రశ్నించుకుంది అరుణ. కిషోర్ ఆమెతో అనుచితంగా ప్రవర్తించాడా అనే అనుమానం తలెత్తింది.

సుచేత గురించి ఆమెకి బాగా తెలుసు. చీప్‌గా ఊహించలేకపోయింది. ఆమెకలాంటి అవసరం లేదు కూడా. ఇకపోతే కిషోర్! అతనూ చీప్‌గా ప్రవర్తించడు. కానీ తేడా ఒక్కటే స్త్రీ పురుషులకి బేసిగ్గా కొంత ఆలోచనా వైరుధ్యం ఉంటుంది. ఇలాంటి విషయాల్లో స్త్రీ ఎంత సెంటిమెంటల్‌గా ఉంటుందో, మగవాడంత డిటాచ్డ్‌గా ఉంటాడు. ఒక స్త్రీతో ఎఫైర్ అతనికి టీ తాగినంత ఈజీ.

సుచేతకి ఆఫీస్‌కి ఫోన్ చేసింది అరుణ. సుచేత పొడిపొడిగా మాట్లాడి ఫోన్ పెట్టెయ్యబోతుంటే తనే అంది - "చంటిపిల్లనీ, నా నీరసాన్నీ వెంటేసుకుని నేనే అక్కడికి రానా? లేకపోతే నువ్వే వస్తావా? నువ్వేదో దాస్తున్నావు. అదేమిటో నాకు తెలియాలి!"

సుదీర్ఘంగా నిశ్వసించింది సుచేత. "సాయంత్రం అటొస్తాలే!" అని ఫోన్ పెట్టేసింది. తనుకూడా ఫోన్ పెట్టేసి వెనక్కి తిరిగేసరికి గుమ్మంలో కిషోర్.

"పాపం, ఆ అమ్మాయిని ఎందుకు వేధిస్తున్నావు? నీ మనసులో ఏమని అనుమానిస్తున్నావో, అది నిజమే! ఇట్ వాజ్ జస్ట్ కాజువల్! అందులో ఏ కమిట్‌మెంటూ లేదు!" అన్నాడు.

అరుణ దిగ్భ్రాంతికి గురైంది. "మన దాంపత్య ఫలితంగా నేను హాస్పిటల్లో చేరి చావుబతుకుల్లో పోరాడుతుంటే మీరు ... మీరిక్కడ కాజువల్ ప్లెజర్స్ వెతుక్కున్నారా?" అతి కష్టంమీద అంది.

తప్పుచేసిన మనిషికి నిలదీయటం నచ్చదు. కిషోర్‌కే నచ్చలేదు అరుణ తననలా నిలదియ్యటం. "ఎందుకంత సీరియస్‌గా రియాక్టవుతావు? నువ్వు హాస్పిటల్లో ఉన్నప్పుడు నేను అన్నం తినలేదా?

స్నానం చేయలేదా? అలాగే ఇదీను! మేమిద్దరం ఆ విషయాన్ని మరిచిపోవాలనుకున్నాం. ఇప్పుడు నువ్వు సుచేతని పిలిచి పెద్ద సీన్ క్రియేట్ చెయ్యకు!" అన్నాడు.

వెంటనే సుచేతకి రింగ్ చేసి, "మీరు రానవసరం లేదు. అరుణని నేను టాకిల్ చేస్తాను!" అని చెప్పాడు.

అతని ధోరణికి అరుణ పజిలైంది. అతనికి సుచేతతో ఎలాంటి కమిట్‌మెంటూ లేదు. మరి తనతోటయినా ఉందా? ఎంత తరచి తరచి ఆలోచించినా లేదనే అనిపిస్తోంది. అలాంటి వ్యక్తిని పెళ్లి చేసుకుని ఎంత పొరపాటు చేసింది! నిజాయితీగల శత్రువుతో సహజీవనం చేయవచ్చుగానీ నిజాయితీ లేని మిత్రుడితో చేయడం కత్తిమీద సాములాంటిది. తనేం చెయ్యాలిప్పుడు?" ఒకటి కాదు, రెండు కాదు రోజుల తరబడి ఆలోచించింది అరుణ. విడిపోవడం తప్ప మరో గ్యతంతరం కనిపించలేదు. మెటర్నిటీ లీవు పూర్తయ్యేసరికి ప్రమోషన్‌మీద ట్రాన్స్‌ఫరొచ్చింది. దాన్ని యాక్సెప్ట్ చేసి వెళ్లి జాయినయింది. పిండిబొమ్మలా బలహీనంగా తయారైన అరుణ మూణ్నెల్ల పసిపాపతో ఇంట్లోంచి కదిలి వెళ్తుంటే కిషోర్‌కి బాధనిపించింది. ప్రమోషన్ డిక్లయిన్ చేస్తే ఆమెను ఇక్కడే ఉంచుతారు. అయినా ఆమె వెళ్లడానికే నిశ్చయించుకుంది. అంటే ... తనకి దూరంగా వెళ్లిపోవాలనుకుంటోందా? ఆమె మనసులోంచి ఒక్క మాట కూడా బయటకు రాలేదు. ముందుగా తనే మాట్లాడటానికి అహం అడ్డొచ్చింది.

వెళ్లే ముందు కిషోర్‌తో మాట్లాడింది అరుణ. "సుచేతతో ఇంత జరిగాక కూడా ఏ కమిట్‌మెంటూ లేదన్నారు. దాన్నిబట్టి చూస్తే నాతోటయినా ఉందో, లేదో అనేది అనుమానమే. స్త్రీ అంటే కాజువల్ ఎంటర్‌టైన్‌మెంటు మీ దృష్టిలో. అలాంటప్పుడు మనం కలిసి ఉండటంలో అర్థం లేదు. అర్థం లేకుండా కలిసి ఉండటం కన్నా విడిపోవటం మంచిది."

వికర్షణలో కడపటి అంచుకు చేరుకున్నాడు కిషోర్. "చిన్న విషయానికి పెద్ద రాద్ధాంతం చేస్తున్నావు. విడిపోవాలన్నదే నీ కోరికైతే అలాగే కానీ!" తిరస్కారంగా అన్నాడు.

✣ ✣ ✣

దాదాపు ఏడాది దాకా సుచేత కిషోర్‌ని కలవనేలేదు. వాళ్లిద్దరూ డైవోర్సు తీసుకున్న సంగతి తెలిసి చాలా బాధపడింది. అరుణని కలుద్దామని రెండుసార్లు ప్రయత్నం చేసి విరమించుకుంది. తామిద్దరూ మార్కెట్లో కలవటం దగ్గిర్నుంచీ ఒక్కొక్కటీ గుర్తొచ్చి విషయాలన్నీ ముళ్లలా గుచ్చేవి. మరోవైపు కిషోర్‌తో ఏర్పడిన సాన్నిహిత్యం మరుపుకి రావటంలేదు. అతను కావాలని కాదు, అతన్తో ఇంతదాకా వచ్చాక ఏమీ జరగనట్టు మరో వ్యక్తిని ఎలా పెళ్లి చేసుకోవడం అనే ఆలోచన.

తండ్రి తెచ్చిన సంబంధాలన్నీ తిరగ్గొట్టింది. కొన్నాళ్లక్రితందాకా పెళ్లికి సుముఖంగా ఉన్న సుచేత ఒక్కసారిగా ఎందుకిలా మరిపోయిందోనని ఆమె తల్లికి సందేహం కలిగింది. కూతుర్ని తరచి తరచి అడిగి విషయం రాబట్టుకుంది.

"అయితే వాళ్లిద్దరూ విడాకులు తీసుకున్నారా?" నిర్ధారణకోసం అడిగింది.

"ఊఁ."

"పాప ఎక్కడుంది?"

"అరుణే తీసుకెళ్లింది."

"అతనెలాంటివాడు చేతూ?"

ఎలాంటివాడని చెప్తుంది? సమాజంలో ప్రస్తుతం ఎస్టాబ్లిష్ అయి ఉన్న స్టాండర్డ్స్ ప్రకారం మంచివాడే. మంచివాడైతే ఇలా ఎందుకు జరుగుతుంది? చెడ్డవాడైతే అరుణని పెళ్లెందుకు చేసుకుంటాడు? ఎటూ నిర్ధారించలేకపోయింది.

ఆమె మనస్థితిని అర్థం చేసుకుంది తల్లి. "అరుణ లేచిపోయి వచ్చి పెళ్లి చేసుకుంది కాబట్టి అతనికి ఆమెపట్ల గౌరవం అంతంతమాత్రంగానే ఉంది. మేం వెళ్లి అతని పేరెంట్స్‌తో మాట్లాడి అన్నీ సెటిల్ చేసి వస్తాం. చూడు, అతను నీ కొంగు పట్టుకుని తిరక్కపోతే ..." అంది.

అతన్ని తను చేసుకోవాలా? సుచేత సంఘర్షణ పడింది.

"అరుణ వదిలేసినా, నువ్వు చేసుకోనన్నా అతనికేం నష్టం లేదు. మరో ఆడపిల్ల ముందుకొస్తుంది. నువ్వయినా పెళ్లిచేసుకోకుండా ఎంతకాలం ఉంటావు? ఎవరో ఒకర్ని చేసుకోక తప్పదు. ఇలాంటి విషయాలు దాగవు. బయటపడ్తే ఎంతెంత గొడవలొస్తాయి? నువ్వే ఆలోచించుకో చేతూ!"

తల్లిమాట కాదనలేకపోయింది సుచేత. ఆమె వ్యక్తిత్వం ఉన్న ఆడపిల్లే. కానీ ఆమె వ్యక్తిత్వం తల్లిదండ్రులనే క్రాస్ చేస్తే తయారైన హైబ్రీడ్ మొక్కలాంటిది.

✣ ✣ ✣

"ఎలా ఉంది చేతూ?"

శ్రోతలిద్దరూ తెల్లబోయారు.

ఆ ముగ్గుర్లోకీ ముందుగా తేరుకున్నది అరుణే. కాబట్టే ఇక్కడికి రాగలిగింది. సుచేత పక్కదగ్గరగా స్టూలు లాక్కుని కూర్చుంది.

సుచేత కళ్లలో నీళ్లు నిండాయి. "నీకు ద్రోహం చేశాను, దానికి శిక్ష అనుభవిస్తున్నాను!"

## తెలుగు సినిమామీద శ్రద్ధ

'ఫిలిమ్‌నగర్' సినిమాద్వారా హీరోయిన్‌గా పరిచయం అయిన శ్రద్ధ పద్మాలయా స్టూడియోస్‌లో 'ఫిలిమ్‌నగర్'కోసం ఓ పాట చిత్రీకరణలో జాకీతోపాటు పాల్గొంది.

శ్రద్ధ మొట్టమొదటి సినిమాలో నటిస్తున్నట్లుగా లేదు. ప్రొఫెషనల్ నటిలా ఫీలవుతూ చేసింది. ముఖ్యంగా డాన్స్ మాస్టర్ బాబు చెప్పిన మూవ్‌మెంట్స్‌ని సునాయాసంగా చేయగలిగింది.

**'ఫిలిమ్‌నగర్' చిత్రంలో మీ పాత్ర?**

"హీరో కావాలని నా స్నేహితుడు ఫిలిమ్‌నగర్ ప్రవేశిస్తాడు. ప్రొడ్యూసర్లు అతగాడ్నే హీరోయిన్‌ని తీసుకురమ్మన్నారు. నన్ను హీరోయిన్‌గా తయారుచేసి తీసుకెళ్తాడు. తీరా సినిమా ప్రారంభం అయ్యేసరికి నాకైతే హీరోయిన్ ఛాన్సుంటుంది కానీ, నన్ను తీసుకొచ్చిన వ్యక్తికి తరువాత సినిమాలో ఛాన్స్ ఇస్తామని చెప్పి సురేష్ సరసన హీరోయిన్‌గా బుక్ చేస్తారు. అదీ కథ!" అంది శ్రద్ధ.

**మీ ప్లానింగ్ ఏమిటి?**

"నా పేరు శ్రద్ధ. నా శ్రద్ధంతా తెలుగు సినిమాలమీదనే. ఇక్కడ నన్ను చూసినవారంతా ఎంకరేజింగ్‌గా మాట్లాడుతున్నారు!" అంది.



అంది.

"నువ్వు నాకు ద్రోహం చేయడమేమిటి? నాన్సెన్స్! అతను ఎరవేసిన గాలానికి చిక్కుకున్న మొదటి చేపని నేను, రెండో చేపవి నువ్వు. అంతే!"

కిషోర్ కూర్చున్న చోట అస్థిమితంగా కదిలాడు. అక్కణ్ణుంచి లేచి వెళ్లిపోవాలనుకున్నాడు కానీ ఆ పని చెయ్యలేకపోయాడు.

"పాపని హాస్టల్లో చేర్పిస్తుంటే చూశాను. మూడేళ్ల పిల్లని హాస్టల్లో ఉంచడమేమిటి?"

"అంతా నా కర్మ! ఎవరున్నారని దాన్ని చూడటానికి? అమ్మా, నాన్నా యాక్సిడెంట్లో పోయారు. తమ్ముడు కెనడాలో ఉన్నాడు. తను ... తనకి నన్ను ఎటెండవటం, ఆఫీసుకెళ్లటంతోటే సరిపోతోంది!"

"మా పాప కూడా అదే స్కూలు. నీ కూతుర్ని నేను తీసుకెళ్లనా? ఇద్దరూ కలిసి వెళ్లి వస్తూంటారు."

ఒక్క క్షణం ... అక్కడ నిశ్శబ్దం కూడా నివ్వెరబోయింది.

"అరుణా!" దిగ్భ్రాంతిగా అంది సుచేత. "పాపని ... నువ్వు .... తీసుకెళ్తావా? ఎందుకు? ఎందుకని నామీద నీకింత దయ కలిగింది?" ఉద్వేగం తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరయింది సుచేత. ఆత్మీయులమంటూ ఒకరొచ్చి బాధని పంచుకోవటంలో ఇంత ఆనందం ఉంటుందా? అరుణ తనకి చేయూతనిస్తుందా? తన పాపకి అమ్మ కాబోతోందా? ఎంతో నిశ్చింత కలిగిందామెకి. కిషోర్‌తో ఆమెకి ఫుల్‌ఫ్లెడ్జ్‌డ్‌గా ఎలాంటి అనుబంధమూ ఏర్పడలేదు. అన్నిటికీ మించి అతన్ని విశ్వసించలేకపోతోంది. అరుణ ఉండగానే తనతో సంబంధం ఏర్పరుచుకున్న అతను మూడో స్త్రీని ఆహ్వానించడని నమ్మకమేమిటి?


కిషోర్ మరోలా ఆలోచిస్తున్నాడు. అరుణ ఒంటరితనంతో బాగా విసిగిపోయింది. ఈ ప్రతిపాదనతో తెగిపోయిన సంబంధాన్ని పునరుద్ధరించుకుందామనుకుంటోందని భావించాడు.

సుచేత 'ఎందుకు?'కి అరుణ నింపాదిగా జవాబిచ్చింది. "కిషోర్ మరో చేపని వెతుక్కోవాలి సుచేతా! అందుకు ఈ పసిది ఆటంకంగా ఉంటుందని!"

కిషోర్‌కి మిడిగుడ్లు పడ్డాయి. తన జీవితంలోంచి మౌనంగా నిష్క్రమించిన అరుణ ... తనుందో, లేదో ఎక్కడుందో కూడా తెలియకుండా బతికిన అరుణ ... ఇంత హఠాత్తుగా పునఃప్రవేశం చేసింది, తనమీద కక్ష తీర్చుకోవడానికన్నమాట! సుచేత ఆమెతో ఏకీభవిస్తుందా? ఆత్రంగా ఎదురు చూశాడు. అతను ఎదురు చూసినంతసేపు పట్టలేదు ఆమె అంగీకారం చెప్పడానికి.

ఆ ఇద్దరు స్త్రీల అవిశ్వాస ప్రకటనతో అతని అంతరంగానికి ఉరిబడింది. ■

# తెలుగువారి ఆదరణ కావాలి



"నాది నెల్లూరు అండీ....అచ్చమైన తెలుగుపిల్లనే" అంది తన అంగాంగవైభవాన్ని అలవోకగా కుదుపుతూ.

నిజమే....ఉజ్వల పుట్టింది, పెరిగింది నెల్లూరే....ఆ ఇంట్లో ఎక్కడా తమిళవాసన లేదు. కన్నడ, మలయాళ భాషలంటే తెలియదు. కాస్త హిందీ తెలుసేమో! కాని, ఆమె తెరజీవితం దక్షిణాదిన ఎగబాకింది. కన్నడ, మలయాళ చిత్రాల్లో మంచిపేరు సంపాదించి పెట్టిం దామె నటనావిశేషం. అక్కడ అగ్రశ్రేణి నాయకులసరసన నటించింది. కన్నడంలో హీరో ప్రభాకర్‌తో 'మై డియర్ టైగర్', రాజ్‌కుమార్, దేవరాజ్‌లతో 'కెంపుమొగిలు', కుమార్ బంగారప్పతో 'నిర్బంధ'; మలయాళంలో సురేష్‌గోపితో 'సువర్ణ సింహాసన', జగదీశ్‌తో 'మాంగల్యఫలక్' నటించింది.

కన్నడ రీమేక్ అయిన హిందీచిత్రం 'అగ్నిసాక్షి'లోని మనీషా కొయిరాలా పాత్రను 'వెల్లిమణి తాళి'లో నటించింది. మిథున్ చక్రవర్తితో నటించిన 'సికందర్ సడక్' త్వరలో విడుదలకాబోతోంది. వీటితోబాటు తెలుగుచిత్రాలూ చేసింది. సాయికృష్ణ దర్శకత్వం వహించిన 'తాళికట్టు శుభవేళ'లో మంచిపేరు సంపాదించుకుంది. శివాజీరాజాతో 'మేధావి'లో నటించింది. ఆర్. నారాయణమూర్తి 'కూలన్న'లో నటించింది. ఇవన్నీ త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

గ్లామర్ ఉంది; పెర్‌ఫార్మెన్స్ వాల్యూస్ తెలుసు. ఏ భాషనైనా ఇట్టే పట్టేయగల సమర్థత ఉంది. అందరూ మంచిపిల్ల అని ముద్రవేశారు. కాని, అదృష్టమే కలిసిరాలేదు. అదే ఒనగూడితే, ఉజ్వల మహోజ్వలంగా ప్రకాశిస్తుంది.

## స్నేహచిత్ర 'కూలన్న'

పల్లె వదిలి పొట్టపోసుకునేందుకు పట్నాలకు వచ్చి కూలిపనులతో నడ్డి విరగ్గొట్టుకుంటున్న వారికథ ఆర్. నారాయణమూర్తి 'కూలన్న'కు మూలం. భవన నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి నగరాలలో. వాటికి ప్రధానంగా కావలసిన కూలీలు, ఆ కూలీల జీవిత విధానం కథావస్తువుగా వస్తున్న చిత్రం. ఓ సదాశయంతో చిత్రనిర్మాణం చేపట్టే కమిటెడ్ ప్రొడ్యూసర్, డైరెక్టర్, యాక్టర్ నారాయణమూర్తి.

చిత్రం టాకీపార్టు పూర్తయింది. ఇందులోని ఏడు పాటలకూ ముక్కురాజా డాన్సు మూమెంట్స్ సమకూరుస్తున్నారు. క్లైమాక్స్, ఈ పాటల చిత్రీకరణ ముగిస్తే చిత్రం పూర్తయి విడుదలకు ముస్తాబులు ప్రారంభించుకోవచ్చు.

సంజీవి మాటలు, షేక్ ఇమ్రాన్ సంగీతం, ప్రజాకవుల పాటలు, చిరంజీవి కెమెరా, సంజీవి మాటలు ఈ చిత్రంలో హైలైట్స్. అన్నిటికీమించి ఆర్. నారాయణమూర్తి బహుముఖ ప్రజ్ఞాపాటవాల ప్రదర్శన, ఉజ్వల ఉత్తమనట విశేషణ.



'కూలన్న'లో ఉజ్వల, నర్రా